క్లుప్తంగా

ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులను నియంత్రించాలి



ప్రైవేట్ పాఠశాలలను సందర్శిస్తున్న టీఆర్ఎస్వీ నేతలు

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలని టీఆర్ఎస్వీ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి షోయబ్ డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీఆర్ఎస్వీ బడిబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో సరైన వసతులు లేక, అధిక ఫీజుల భారంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట అంజియాదవ్, మహేష్, శివ, శివనాయక్, సురేష్, వినోద్ తదితరులున్నారు.

సమ్మె నోటీసు అందజేత



పవర్ ప్లాంట్ సీఈ రమేష్‌బాబుకు సమ్మె నోటీసు అందచేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సీఈ రమేష్‌బాబుకు ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును సీఐటీయూ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్, సహాయ కార్యదర్శి ఎస్‌కె.సుభాని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ ఇన్‌చార్జి ఏఈగా దేవోజీనాయక్

పెద్దఅడిశర్లపల్లి : పెద్దఅడిశర్లపల్లి విద్యుత్ ఇన్‌చార్జి ఏఈగా నేనావత్ దేవోజీనాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కావ్య నల్లగొండ కన్‌స్ట్రక్షన్ ఏఈగా బదిలీ కాగా, ఆమె స్థానంలో కొండమల్లేపల్లి సబ్ ఇంజనీర్ రమేష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే రమేష్ సెలవుపై వెళ్లడంతో దేవోజీనాయక్‌కు ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు అప్పగించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

ముందస్తు అరెస్టు చట్ట విరుద్ధం



అరెస్ట్ అయిన వీఆర్ఏ వారసులు

కొండమల్లేపల్లి: వీఆర్ఏల వారసులు హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేయడం సరికాదని వీఆర్ఏల వారసుల సంఘం కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు బొడ్డు రామకృష్ణ అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో 20,500 మంది వీఆర్ఏల వారసులను రెగ్యులరైజ్ చేస్తూ జీఓ ఇచ్చిందని, కానీ వీరిలో 16,700 మందికి మాత్రమే ఆర్డర్స్ ఇచ్చిందన్నారు. మిగిలిన 3,797 మందికి ఇప్పటివరకు ఆర్డర్స్ ఇవ్వకపోవడంతో రెండేళ్లనుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నారని ఆందోళ వ్యక్తం చేశారు. అరెస్టు అయిన వారిలో వీఆర్ఏల వారసుల సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు రామకృష్ణ, జాని, సైదులు ఉన్నారు.

ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలి



ప్లాంట్ వద్ద ఆందోళన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

మిర్యాలగూడ : మిషన్ భగీరథ ప్లాంట్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం మిషన్ భగీరథ ప్లాంట్ వద్ద ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగి బాండావత్ హాతీరాం మాట్లాడుతూ 11 నెలలుగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఉద్యోగుల కుటుంబాలు రోడ్డు పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు వెంటనే వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ధీరావత్ వెంకటేష్, ఎర్ర సాయి తేజ, కల్లేపల్లి ప్రవీణ్, హాలావత్ భిక్షం, తేజావత్ తారాసింగ్, కుర్ర రంగా, నాగేశ్వర్‌రావు, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



చందర్‌నాయక్ పదవీ విరమణ సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ మండలం గన్యానాయక్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డానియల్, మారుపాకల సురేష్‌గౌడ్, కొర్ర రాంసింగ్, కొర్ర రవినాయక్, బాలు, నేనావత్ గోపాల్, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసినప్పుడే గుర్తింపు

చందంపేట : ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పని చేసినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదిస్తారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చందంపేట ఎంఈఓగా పని చేసి పదవీ విరమణ పొందిన కె.చందర్‌నాయక్ సన్మానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. చందర్‌నాయక్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడిగా, ఎంఈఓగా కె.చందర్‌నాయక్ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్యానాయక్, ముత్యాల సర్వయ్య, గోవిందుయాదవ్, బిక్కునాయక్, మల్లారెడ్డి, అనంతగిరి, కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంఈఓ సామ్యనాయక్, హెచ్‌ఎం చంద్రశేఖర్, సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలం జంకు తండా గ్రామంలోని నిరుపేద గిరిజన, హరిజన, బుడగజంగాలు, సంచార జాతులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాధినేని శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏఓ శ్రీనివాస్‌శర్మకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారికి ఇళ్లు కేటాయించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, బీజేపీ నాయకులు జానకిరాంరెడ్డి, సజ్జల నాగిరెడ్డి, రాజశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

క్రిస్టియన్ సంఘాలకు అండగా ప్రభుత్వం

రామగిరి(నల్లగొండ): క్రిస్టియన్ సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. నల్లగొండ మరియగిరి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవరెండ్ ఫ్రాన్సిస్ ధనరాజ్ ఆధ్వర్యంలో సోమవారం క్రిస్టియన్ కార్పొరేషన్ సభ్యులు దీపక్ జాన్‌ను హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సంఘం సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పసల శౌరయ్య, రెడ్డిమాస్, చార్లెస్, కామినేని జయరాజ్, బొజ్జ ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. సోమవారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ఎన్నికలకు సిద్ధం కావడం బీసీలను మరోమారు మోసం చేసినట్టేనని ధ్వజమెత్తారు. అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల శ్రీను, పున్న వెంకటేష్, వీరయ్య, లక్ష్మణ్, గోపి, యాదయ్య, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

2వ తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలు

నల్లగొండ: విద్యుత్ భద్రతా వారోత్సవాలు జూలై 2 వరకు నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు తెలిపారు. నల్లగొండ టౌన్ 1 సెక్షన్ పరిధిలోని గొల్లగూడ సబ్ స్టేషన్ ఆవరణలో సోమవారం విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం విద్యుత్ సిబ్బందికి భద్రతా పనిముట్లు అందజేశారు.

వెంకటాపురంలో పౌరహక్కుల దినోత్సవం

నిడమనూరు: మండలంలోని వెంకటాపురంలో పౌరహక్కుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. వెంకటాపురం ఎస్సీ కాలనీలో స్థానికులతో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య సమావేశమై, పౌరుల హక్కులు- బాధ్యతలు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉప్పు సురేష్, రెవెన్యూ అధికారులు రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ రద్దుకు బీజేపీ కుట్ర

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసి రిజర్వేషన్ రద్దుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఇంచార్జి బొలుగురి నర్సింహ అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై దాడులు, వేధింపులు పెరిగిపోయాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వల్లంపట్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, సీపీఐ మండల కార్యదర్శి రామలింగయ్య, దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్, నాయకులు లింగానాయక్, సైదులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొలుగురి నర్సింహ

మూడు నెలల రేషన్ కోటా పూర్తిచేశాం

నిడమనూరు : తహసీల్దార్ జంగాల కృష్ణయ్య సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల రేషన్ పూర్తి చేసినట్లు డీలర్లు తెలిపారు. నిడమనూరు మండలంలో రేషన్ కార్డుదారులందరి ఈకేవైసీ పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర కార్పొరేషన్లలో ఇటీవల ఉద్యోగాలు పొందినవారు స్వచ్ఛందంగా రేషన్‌కార్డు రద్దు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు తోట నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షురాలు కందుల సైదమ్మ, జానారెడ్డి, మదన్‌మోహన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధన



చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న అధికారులు

త్రిపురారం : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యా బోధన చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయకుమారి అన్నారు. సోమవారం పెద్దదేవులపల్లి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాలలో ఎల్ఈడీ టీవీని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అనువజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన వల్ల విద్యార్థులకు ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రమావత్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ

తిప్పర్తి : రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని తిప్పర్తి ఏఓ బి.సన్నిరాజు దుకాణదారులక సూచించారు. సోమవారం తిప్పర్తి మండలంలోని పజ్జూరు గ్రామంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎరువులు, విత్తనాలను అధిక ధరకు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకెళ్లి ఎరువులు కొనుగోలు చేయాలన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఆర్పీలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.శ్రీనివాస్‌ను మెప్మా ఆర్పీలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయడంతో పాటు ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు మహిళలంతా కీలకంగా వ్యవహరించాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీఎంసీ పోతేపాక బక్కయ్య, ఆర్పీలు జాజుల చంద్రకళ, సరిత, రజిత, భవాని, నాగమణి, మాధవి, కమిలి తదితరులున్నారు.



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మెప్మా ఆర్పీలు

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపల్ కమిషనర్‌గా గురులింగం సోమవారం విధులలో చేరారు. ఈయన జోగిపేట మున్సిపాలిటీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన దండు శ్రీను చిట్యాల మున్సిపాలిటీకి వెళ్లారు. విధులలో చేరిన గురులింగంను మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సత్కరించారు.



గురులింగం

ఆదర్శ పాఠశాల ఎదుట డ్రెయినేజీకి పైపులైన్

సాక్షి ఎఫెక్ట్..

నిడమనూరు : పాఠశాలలోకి వెళ్లేదెలా... శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా వంద మీటర్ల పరిధిలో కాల్వ తీశారు. సీసీ పైపులు(గూనలు)రెండు రోజుల్లో వేస్తామని మండల పంచాయతీ అధికారి కేథార్‌నాథ్ తెలిపారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకొంటామని పంచాయతీ కార్యదర్శి రామలింగాచారి తెలిపారు. పంచాయతీల్లో నిధులు లేకున్నా విద్యార్థుల సంక్షేమ దృష్ట్యా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీవో తెలిపారు.



పాఠశాల ఎదురుగా జరుగుతున్న మురుగుకాల్వ పైపులైన్ పనులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

చందంపేట : సమాజాన్ని తీర్చిదిద్దడంలో కీలకమైన ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని నేరేడుగొమ్ము ఎంఈవో రఘు అన్నారు. నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎండి.మతీన్, ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు రాఘవేందర్‌రెడ్డిల పదవీ విరమణ సన్మానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా వారు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం వారిని సన్మానించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 29న నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్(అండర్ -14) పోటీల్లో పాఠశాలకు చెందిన పి. వెంకటసాయి, ఎస్‌కే జనీబ్, ఆర్. నిఖిలేష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ కిరణ్‌కుమార్ తెలిపారు. వీరు హనుమకొండలోని జెఎన్‌వీ స్టేడియంలో జులై 6, 7 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ సిస్టర్ క్లారా, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులతో సిబ్బంది

ఫిల్టర్ బెడ్ శుభ్రత పనుల పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీకి మంచినీటిని అందించే ఫిల్టర్ బెడ్ ప్లాంటు శుభ్రపరిచే పనులను మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ప్లాంటుకు సంబంధించిన పూర్తి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలం ప్రారంభమైనందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. వర్షకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా, మురుగునీరు రాకుండా ఉండేందుకు పూర్తి స్థాయిలో క్లోరినైజేషన్ చేయాల్సిన అసవరం ఉందన్నారు. ఆయన వెంట మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఏఈ సాయితేజ తదితరులున్నారు.



ప్లాంట్ శుభ్రత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని ధర్నా



దామరచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీర్లపాలెం భూనిర్వాసితులు

మిర్యాలగూడ : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ భూనిర్వాసితులు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ నిర్వాసితులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ నిర్మాణం సమయంలో తమ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని.. భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటివరకు కొందరికి భూమి డబ్బులు సైతం రాలేదని.. ఉద్యోగాల ఊసే లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఈ మేరకు డీఏఓ శ్రీనివాస్‌శర్మకు వినతిపత్రం అందచేశారు. దామరచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సైతం భూనిర్వాసితులు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎస్.నాగేందర్, శివనాయక్, రాధాకృష్ణ, హన్మంతు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను ఆదుకోవాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ భూ నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నష్ట పరిహారం, ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పేరుపొంగు సైదులు, మట్టయ్య, దర్శణం రాజా, భిక్షమయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వేములపల్లి : విద్యుత్ ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మిర్యాలగూడ రూరల్ విద్యుత్ ఏడీఈ రవీందర్‌రెడ్డి కోరారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో రైతులకు, కాంట్రాక్టర్లకు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సాగు భూముల్లో, వ్యాపార సముదాయాల్లో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా ఉన్నట్లయితే విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీఈ రవీందర్‌రెడ్డి

కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తిరుమలగిరి మండల కేంద్రంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించాలని కోరారు. మండల కేంద్రం ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నా నేటికీ ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల కమిటీ సభ్యులు జగదీశ్, పల్లయ్య, చాంద్‌బాషా, గోపి తదితరులు ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. నూతనంగా నిర్మించిన రోడ్ల మధ్యన ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌పై మూతలు లేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే రూ.కోట్లు ఖర్చు చేసి వేసిన డ్రైనేజీ పైపులన్నీ వృథాగా ఉండటంతో కొత్తగా రోడ్లు వేసినప్పుడు అవి చాలావరకు పూడిపోయాయి. కొన్నిచోట్ల పాత డ్రైనేజీ వ్యవస్థ ఉంది. 50ఏళ్లు పైబడటంతో చెట్ల వేర్లు పోయి చాలాచోట్ల పైపులు పాడయ్యాయి. వాటిని మరమ్మతులు చేయడమో లేదా కొత్త డ్రైనేజీ పైపులు వేయడమే చేయాలని స్థానికులు కోరుతున్నారు.



హిల్‌కాలనీ బాలవిహార్ సమీపంలో మూత లేక ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్



కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

ఆత్మరక్షణకు కరాటే దోహదం

మిర్యాలగూడ అర్బన్: ఆత్మరక్షణకు, ఆత్మవిశ్వాసానికి కరాటే దోహదం చేస్తుందని మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర రాజు అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ కరాటే మాస్టర్ బంటు రామారావు వద్ద శిక్షణ పొందుతూ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో అర్హత సాధించిన విద్యార్థులకు సోమవారం తన కార్యాలయంలో బెల్టులు, ప్రశంసా పత్రాలను డీఎస్పీ అందజేశారు. జాల సైదులు, రాకేష్‌రెడ్డికి బ్లాక్ బెల్ట్, నాగార్జున, హేమంత్‌కు బ్రౌన్ బెల్ట్, పి. అభిరామ్‌కు గ్రీన్ బెల్ట్, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.